
సాక్షి కర్నూలు

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయంలో శనివారం భక్తుల సందడి కనిపించింది. కేనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.



తర్తూరు జాతర చూసొద్దాం

తర్తూరు గ్రామంలో శ్రీలక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 13న స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నారు. 8లో▸



ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో వీరభద్ర స్వామి, కాళికాదేవిల బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

స్వర్ణ రథోత్సవం.. దేదీప్యమానం



ఆలయ మాడవీధిలో స్వర్ణరథోత్సవ దృశ్యం

శ్రీశైలంటెంపుల్: రుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం దేదీప్యమానంగా నిర్వహించారు. హర..హర.. మహాదేవ, ఓం నమఃశివాయ అంటూ శివనామస్మరణ చేస్తూ నీరాజనాలు సమర్పించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు చేశారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం స్వర్ణ రథంపై ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి విశేషపూజలు నిర్వహించారు. ఆలయ మహాద్వారం ముందుభాగం నుంచి నంది మండపం వరకు మాడవీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవంలో కోలాటం, చెక్కభజన.. తదితర జానపద కళారూపాలు అలరించాయి. శ్రీశైల దేవస్థాన సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖర రెడ్డి, పండితులు, అర్చకులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేశ భక్తిని పెంచే రాష్ట్ర సేవికా సమితి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు (సెంట్రల్): దేశ భక్తిని రాష్ట్ర సేవికా సమితి పెంపొందిస్తుందని సమితి ప్రాంత సహ కార్యవాహిక ఉజ్వల అన్నారు. రాష్ట్ర సేవికా సమితి ప్రారంభమై 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ సంఘం సభ్యులు సంబరాలు చేసుకున్నారు. కర్నూలు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య వక్తగా సమితి ప్రాంత సహ కార్యవాహిక ఉజ్వల మాట్లాడుతూ.. 90 సంవత్సరాలుగా మహిళలను చైతన్యం చేస్తూ రామాయణం, భాగవతాలను వివరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్వర్ణలత, అన్నయ్య, వసంతలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి పెరగనున్న ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): వేసవి ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత నేటి నుంచి పెరుగనున్నాయి. గురువారం మధ్యాహ్నం నుంచి ఉమ్మడి జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడటంతో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. శనివారం కూడా ఎండల తీవ్రత, వడగాల్పులు పెరిగాయి. కోసిగి, కర్నూలు అర్బన్, కోడుమూరు, దొర్నిపాడు, గడివేముల, కొత్తపల్లిలలో 39 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నెల 6 నుంచి ఉమ్మడి జిల్లాలో ఎండలు, వడగాల్పుల తీవ్రత పెరిగే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీ ప్రకటించింది. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు, రైతులు, ఇతరులు వడగాల్పుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. సాయంత్రం వేళల్లో అకాల వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం.

దళారీలకే 'మద్దతు'

- కందుల కొనుగోలు కేంద్రాల్లో దళారీల హల్‌చల్
- రైతుల నుంచి రూ.7,200 ధరతో కొనుగోలు
- కొనుగోలు కేంద్రాల్లో రూ.7,550 మద్దతు ధరతో అమ్మకం
- దళారీల నుంచి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న మార్క్‌ఫెడ్ అధికారులు

అడుగడుగునా అన్నదాతలు దోపిడీకి గురవుతున్నారు. విత్తనాల కొనుగోలు నుంచి దిగుబడి అమ్ముకునే వరకు మాటు వేసి దోచుకుంటున్నారు. ఆరుగాలం రెక్కల కష్టంతో పండించిన దిగుబడిని అమ్ముకుందామన్నా దళారులు, వ్యాపారులు నట్టేట ముంచుతున్నారు. దళారులు కందుల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కుమ్మక్కై మద్దతు ధర దర్జాగా పొందుతున్నారు. కొనుగోలు కేంద్రాల జాప్యంతో ఇప్పటికే సగానికి పైగా రైతులు మార్కెట్‌లో అమ్ముకుని నష్టపోగా.. మిగతా రైతులు మద్దతు ధర అందక నష్టపోతున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): కందుల కొనుగోలు కేంద్రాలు అక్రమాలకు కేరాఫ్‌గా మారాయి. మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా దళారీలు, వ్యాపారులే మద్దతు పొందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరందురూ టీడీపీ మద్దతు దారులు కావడం గమనార్హం. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కూడా దళారీల నుంచి కొనుగోలుకు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. క్వింటా ప్రకారం ఇచ్చే గుడ్‌విల్ కోసమేనని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కందుల ధర పడిపోయింది. ధరలు పడిపోయి రైతులు నష్టపోతున్నా.. ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి...రేయింబవళ్లు కష్టించిన రైతుకు అంతంత మాత్రం ధర లభిస్తుండగా... దళారీలు మాత్రం ప్రయోజనం పొందుతున్నారు. 2023-24లో కందుల ధర రికార్డు స్థాయికి ఎక్కింది. 2024-25 సంవత్సరంలో కూడా ధరలు ఇలాగే ఉండే అవకాశం ఉందని భావించిన రైతులు పెద్దఎత్తున సాగు చేశారు. 2024 డిసెంబరు నెల వరకు కూడా కందుల క్వింటాలుకు రూ.9,000 వరకు లభించింది. అయితే ఈ ఏడాది జనవరి నుంచి ధర పతనం అయింది. కాగా వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తున్నాయంటే చాలు ప్రతి గ్రామంలో దళారీలు, వ్యాపారులకు మంచి సీజన్ వంటిది. ధరలు తగ్గడం మొదలైన వెంటనే దళారీలు రైతులను భయభ్రాంతులకు గురి చేశారు. రానున్న రోజుల్లో ధరలు మరింత పడిపోతాయి.. ఇపుడు మంచి ధర ఉంది.. అమ్ముకోవాలని నమ్మించారు. వారి మాటలు నమ్మిన రైతుల నుంచి క్వింటా రూ.6,800 నుంచి రూ.7,200 వరకు మేర కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. అలా కొనుగోలు చేసిన దళారీలు ఇపుడు మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర రూ.7,550 ప్రకారం అమ్ముకుంటున్నారు. కష్టించి పండించిన



అమ్మకానికి కందులను సిద్ధం చేస్తున్న రైతులు



కందుల బస్తాను తూకం వేస్తూ..

రైతుకు నష్టం రాగా.. దళారీలు మాత్రం రూపాయి పెట్టుబడి పెట్టకుండా క్వింటాపై సగటున రూ.200 నుంచి రూ.600 వరకు లాభం పొందుతున్నారు. దళారీలు నుంచి కొనుగోలు చేయడం వల్ల అధికారులకు కూడా ముడుపులు ముడుతుండటం గమనార్హం.

అంతా రైతుల పేరు మీదనే....

దళారీలు/ వ్యాపారులు అంతా రైతుల పేర్ల మీదనే అమ్మకాలు సాగిస్తున్నారు. ఏపీ రైతు నుంచి కందులు కొనుగోలు చేశాలో వారి నుంచి ముందు జాగ్రత్తగా ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాల నకళ్లను కూడా సేకరించుకుంటున్నారు. రెండు, మూడు లారీలు సిద్ధం అయిన తర్వాత రైతుల పేరు మీదనే కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నాయి. రైతులకు తెలిసిన వారే కాబట్టి దళారీలకు సహకరిస్తున్నారు. అయితే కొనుగోలు కేంద్రానికి ఒరిజినల్ రైతులు రారు. దళారీలు వారి భూములకు సంబంధించిన వివరాలు ముందుగానే సిద్ధం చేసుకుంటున్నందున అమ్మకం ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. కందులు అమ్మిన తర్వాత నగదు రైతు ఖాతాకే జమ అవుతుంది.

దళారీల నుంచే 40 శాతం కొనుగోలు

కర్నూలు జిల్లాలో 25 మండలాల్లో కందుల కొనుగోలు ప్రక్రియ జరుగుతోంది. నంద్యాల జిల్లాలో 12 మండలాల్లో జరుగుతోంది. నంద్యాల జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో దళారీలే హవా నడిపిస్తున్నారు. కర్నూలు జిల్లాలో పత్తికొండ, దేవనకొండ, చిప్పగిరి, ఆదోని, క్రిష్ణగిరి, సి.బెళగల్ తదితర మండలాల్లో దళారీలదే పెత్తనం నడుస్తోంది. 2024-25లో ఉమ్మడి జిల్లాలో 2,65,214 ఎకరాల్లో కంది సాగు అయింది. కర్నూలు జిల్లాలో 1,58,749 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 1,06,465 ఎకరాల్లో కంది సాగు అయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2022-23, 2023-24 సంవత్సరాల్లో కందుల ధర మురిపించింది. 2023-24లో రికార్డు స్థాయిలో క్వింటాలుకు రూ.13,500 వరకు వెళ్లింది. 2024-25లో పండించిన కందులు మార్కెట్‌లోకి వచ్చిన తర్వాత ధరలు తగ్గుముఖం పట్టాయి. రానున్న రోజుల్లో జరిగే కొనుగోళ్లలో 60 శాతం దళారీల నుంచే కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 3,242 మంది రైతుల నుంచి 4,289 టన్నుల కందులు కొనుగోలు చేశారు.నంద్యాల జిల్లాలో దాదాపు 2,650 మంది రైతుల నుంచి 2,800 టన్నులు కొనుగోలు చేశారు. ఇందులో 40 శాతం వరకు దళారీల నుంచి కొనుగోలు చేసినట్లుగా తెలుస్తోంది.

- పత్తికొండ మండలానికి చెందిన ఒక వ్యాపారి ఆరేడు మంది రైతుల పాసు పుస్తకాలు తీసుకెళ్లి ఒకే రోజు 200 క్వింటాళ్లకు పైగా కందులను అమ్ముకున్నారు. ఈ వ్యాపారి ఇలా చాల రోజులుగా కొనుగోలు కేంద్రంలో హల్‌చల్ చేశారు. ఈ అవకాశం కల్పించినందుకు అందరికీ చేతులు తడిపినట్లు తెలుస్తోంది. ఆయన టీడీపీ నేతల మద్దతు ఉన్నట్లు సమాచారం.

కొనుగోలు కేంద్రాల వివరాలు

జిల్లా	కేంద్రాలు	ఇప్పటి వరకు కొనుగోళ్లు (టన్నులు)
కర్నూలు	25	4,289
నంద్యాల	12	2,800

కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ..

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో అమ్ముకుందామని వెళ్లిన రైతులను నిలువునా ముంచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కందులను 50 కిలోల ప్రకారం తూకం వేస్తారు. సంచి బరువుకు అదనంగా 650 గ్రాములు తీసుకోవాలి. అయితే కొన్ని మండలాల్లో క్వింటాకు 1500 గ్రాముల వరకు అదనంగా తీసుకుంటున్నారు. అంటే క్వింటాలుకు దాదాపు 3 కిలోల వరకు అదనంగా తీసుకుంటుండటం గమనార్హం. కర్నూలు జిల్లా పత్తికొండ, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలాల్లో కొనుగోలు కేంద్రాలకు దళారీల బెడద ఎక్కువగా ఉంది. అధికారులకు తెలిసినప్పటికీ చూసిచూడనట్లు పోతుండటం గమనార్హం. ప్యాపిలి మండలం బోయిన్‌చెర్వుపల్లి గ్రామంలో బహిరంగంగానే దళారీల నుంచి కందులు కొనుగోలు చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మద్దిలేటయ్య క్షేత్రంలో భక్తుల రద్దీ



బేతంచెర్ల: శ్రీ మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ కనిపించింది. చైత్ర మాసం కావడంతో నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు దర్శించుకున్నారు. పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రీతి పాత్రమైన వరపూజ చేయడం తోపాటు మహా మంగళహారతి ఇచ్చారు.

దాతలు సహకరించాలి

శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో గదులు నిర్మించిన దాతలు భక్తుల రద్దీ దృష్ట్యా సహకరించాలని ఆలయ ఉపకమిషనర్, ఈఓ రామాంజనేయులు శనివారం తెలిపారు. గతంలో దాతలకు ఏడాదిలో ఐదుసార్లు ఉచితంగా గదులను ఇచ్చేవారమన్నారు. ప్రస్తుతం పెరిగిన భక్తుల రద్దీ దృష్ట్యా పాసులను నెల ముందు పంపాలని సూచించారు. ఒక్కసారి పాసు వాడిన తరువాత మరొక పాసుకు వ్యవధి 10 వారాలు ఉండాలన్నారు.

వైభవంగా వసంతోత్సవం



వసంతోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, భక్తులు

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో శ్రీ చౌడేశ్వరి దేవి రాయబారాది జ్యోతి మహోత్సవాలు వసంతోత్సవంతో శనివారం ముగిశాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ.. ఉదయం శ్రీ చౌడేశ్వరిదేవి, శ్రీ చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి సమీపంలో ఉన్న కోనేరు వరకు వసంతోత్సవం నిర్వహిస్తూ తీసుకెళ్లారు. అనంతరం కోనేరులోని నీటితో విగ్రహాలను శుభ్రం చేసి మళ్లీ ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి



అలంకరణలో జగ్జీవన్‌రామ్ విగ్రహం



నివాళులు అర్పిస్తున్న జేసీ నవ్య , తదితరులు

కర్నూలు(అర్బన్): డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు, సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పిలుపునిచ్చారు. శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి సందర్భంగా స్థానిక ఆర్‌ఎస్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పెద్ద సంఖ్యలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన జయంతి సభలో జేసీతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరు చరితారెడ్డి, మాజీ మంత్రి ఎం.మారెప్ప పాల్గొన్నారు. జేసీ నవ్య మాట్లాడుతూ నేటి విద్యార్థులు కూడా జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మనిషి అభివృద్ధికి పేదరికం అడ్డు రాదని జగ్జీవన్‌రామ్ నిరూపించారన్నారు. ఆయన పేదరికాన్ని అధిగమించి బనారస్ విశ్వ విద్యాలయం నుంచి పట్టభద్రులు అయ్యారన్నారు. సుదీర్ఘకాలం కేంద్రంలో అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించి ఆయా శాఖల్లో తనదైన ముద్రను వేశారన్నారు.

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. 40 సంవత్సరాలు ఓటమి ఎరుగని నాయకుడిగా ఆయన దేశంలోనే గుర్తింపు పొందారన్నారు. ఆయన కుమార్తె మీరా కుమారి పార్లమెంట్ స్పీకర్‌గా ఉండి తన ప్రతిభను చకన బరిచారన్నారు.
- కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ అంటరానితనం పోవాలని పోరాటాలు నిర్వహించిన దళిత ముద్దు బిడ్డ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. 1937లో అతి చిన్న వయస్సులోనే బీహార్ శాసనసభకు ఎన్నికయ్యారన్నారు.
- ఇదిలాఉంటే ఉత్సవాలకు తనకు ఆహ్వానం లేదని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన వేదిక ఎక్కకుండా సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుర్చీలోనే కూర్చొన్నారు. కార్యక్రమంలో ప్రజా, దళిత సంఘాల నాయకులు సోమసుందరం మాదిగ, అనంతరత్నం మాదిగ, రాజ్ కుమార్, వేల్పుల జ్యోతి, నాగేశ్వరి, ఎన్‌సీహెచ్ బజారన్న, ఆర్.కై లాస్‌నాయక్, ఆర్.చంద్రప్ప, ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం దారుణం

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఇందూరి ప్రతాపరెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ శిరివెళ్ల మండల కన్వీనర్ ఇందూరి ప్రతాప్‌రెడ్డిని హత్య చేసేందుకు టీడీపీ నాయకులు యత్నించడం దారుణమని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. రామాలయంలో పూజలు చేస్తున్న వ్యక్తిని హత్య చేయాలనే ఆలోచనలు ఎలా వచ్చాయంటూ ప్రశ్నించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణాను కోరారు. నంద్యాల పట్టణంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి.. ఎస్పీ కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోవిందపల్లె గ్రామంలోని రామాలయంలో ఇందూరి ప్రతాప్‌రెడ్డి పూజలు చేస్తుండగా దుండగులు హత్యాయత్నానికి పాల్పడటం దారుణమన్నారు. పోలీస్ పికెట్ ఉన్న కొంత దూరంలోనే దుండగులు ఇంతటి దారుణానికి ఒడిగట్టడం బాధాకరమన్నారు. కేసును నీరుగార్చేలా, కోర్టులో ప్రతాప్‌రెడ్డి సాక్ష్యాలు చెప్పకుండా భయభ్రాంతులకు గురి చేసేలా హత్యాయత్నం చేశారన్నారు. జిల్లాలో ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు తరచూ దాడులకు పాల్పడుతూనే ఉన్నారన్నారు. వీరిపై జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ఐదుగురిపై కేసు నమోదు

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇందూరి ప్రతాపరెడ్డిపై హత్యాయత్నం ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన రవిచంద్రారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, మరో గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఘటనను ప్రత్యక్షంగా చూసిన కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అండగా ఉంటాం

గోస్పాడు: ఇందూరి ప్రతాపరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ప్రత్యర్థుల దాడిలో గాయపడిన ఇందూరి ప్రతాపరెడ్డిని నంద్యాల పట్టణంలోని ఉదయానంద ఆసుపత్రిలో పరామర్శించారు.

ఆయకట్టు.. పండితే ఒట్టు!

- నీటి మూటలైన టీడీపీ నేతల హామీలు
- పూర్తికాని సాగునీటి పథకాలు
- అరకొర సాగునీటి విడుదల
- పొలాల్లో ఎండుతున్న పంటలు



సాగునీరు అందక హాలహర్వి మండలంలోని చింతకుంట గ్రామ సమీపంలో నెర్రలు ఇచ్చిన వరి పొలం

కర్నూలు సిటీ: తాము అధికారంలోకి వస్తే రాయలసీమలో పెండింగ్ సాగుప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు హామీ ఇచ్చారు. గాలేరు- నగరి, హంద్రీ- నీవా ప్రాజెక్టుల్లో పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని మెనిఫేస్టోలో ప్రకటించారు. ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని బహిరంగంగా ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ మరచిపోయారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు.. రైతులకు ఇచ్చిన మాటలు నీటిమూటలయ్యాయి. సాగునీరు అందక కళ్ల ముందే పంటలు ఎండుతుండటంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రైతుల 'కన్నీటి' కష్టాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తాత్కాలిక బడ్జెట్, వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టినా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులో మొండిచేయి చూపారు.

ఇదీ దుస్థితి..

- తుంగభద్ర నదిలో నీటి లభ్యత ఎక్కువగా ఉంది. అయినప్పటికీ ఆయకట్టుకు కేటాయించిన నీటిని అందించలేకపోయారు.
- ఈ ఏడాది తుంగభద్ర దిగువకాలువకు 22.47 టీఎంసీలు కేటాయించారు. కేటాయింపులో తాగునీటికి పోగా.. 18 టీఎంసీలకుపైగా ఆయకట్టుకు అందించాలి. జలవనరుల శాఖ అధికారుల గణాంకాల ప్రకారమే ఖరీఫ్, రబీలో సగం ఆయకట్టుకు కూడా నీరు ఇవ్వలేకపోయారు.
- టీబీ డ్యాంలో 2 టీఎంసీలకుపైగా నీటి వాటా ఉంది. సకాలంలో వినియోగించుకోకపోవడంతో ఆ నీటిని సైతం కోల్పోయే పరిస్థితులు వచ్చాయి.



పూర్తికాని వేదావతి పంప్‌హౌస్ పనులు

- తుంగభద్ర దిగువ కాలువ కింద ఆయకట్టుకు ప్రస్తుతం నీటిని బంద్ చేశారు. కేవలం తాగుకు మాత్రమే ఈ నెల 10 వరకు కాలువకు నీరు ఇస్తున్నారు.
- తుంగభద్ర జలాశయం నుంచి కేసీ కెనాల్‌కు 9.363 టీఎంసీల నీరు కేటాయించారు. ఇందులో 3.5 టీఎంసీల నీరు హెచ్చెల్సీకి మళ్లించారు. మిగిలిన నీటిలో గత నెలలో 1.61 టీఎంసీలు విడుదల చేస్తే జిల్లాకు 0.6 టీఎంసీ నీరు కూడా చేరలేదు. దీంతో జిల్లా పరిధిలోని కేసీ ఆయకట్టుకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.
- శ్రీశైల జలాలపై ఆధారపడిన హంద్రీ- నీవా కాలువకు సమృద్ధిగా నీరు ఇవ్వడం లేదు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా గత నెల రెండో వారానికి నీటిని బంద్ చేశారు. హంద్రీ- నీవా కాలువ వెంబడి సాగు చేసిన రైతులు, హాలహర్వి మండలంలోని చింతకుంట గ్రామంలో సుమారు 600 ఎకరాలకుపైగా వరి పంటను కోల్పోయారు.



ఎల్లెల్సీఅనుబంధ కాలువ దుస్థితి

- గాజులదిన్నె ప్రాజెక్టుకు కేటాయించిన 3 టీఎంసీలు ఇవ్వలేకపోయారు. హంద్రీ- నీవా కాలువ నుంచి కూడా మూడు నెలలు ఆలస్యంగా గాజులదిన్నె ప్రాజెక్టుకు నీరు ఇచ్చారు. దీంతో 24 వేల ఎకరాల్లో సగం ఆయకట్టుకే నీటిని సరిపెట్టారు.

కష్టాలు ఇవీ..

ఖరీఫ్‌లో భారీ వర్షాలు కురిసి సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు చేరినప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదు. దీంతో ఆయకట్టులో చివరి దశలో ఉన్న పంటలు ఎండిపోయాయి. రైతులకు 'కన్నీటి' కష్టాలు మిగిలాయి. గ్రామీణ ప్రాంతాలకు గుక్కెడు తాగునీటిని ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి. నీటి వనరుల కొరతతో రైతులు, ప్రజలు అల్లాడిపోతున్నారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో వేలాది కుటుంబాలు పొట్టచేత పట్టుకొని వలసలు పోతున్నాయి. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు చేపట్టిన వేదావతి ప్రాజెక్టుకు భూసేకరణ సమస్య వేధిస్తోంది. పనులు వేగంగా చేసేందుకు ఏజేన్సీ ఆసక్తి చూపడం లేదు. ఆర్డీఎస్ కుడి కాలువకు సైతం భూసేకరణ సమస్య ఉంది. పక్క రాష్ట్రం ఫిర్యాదుతో పనులు జరగడం లేదు.

జిల్లాలో ఆయకట్టు వివరాలు...

ప్రాజెక్టు, కాలువ పేరు	విస్తీర్ణం ఎకరాల్లో..
కేసీ కెనాల్	3,763
తుంగభద్ర దిగువ కాలువ	1,51,134
ఆలూరు బ్రాంచ్ కెనాల్	14,255
హంద్రీనీవా కాలువ	60,000
గాజులదిన్నె ప్రాజెక్టు	24,372
చిన్న నీటిపారుదల శాల పరిధి	27,707
ఎత్తిపోతల పథకాల కింద	20,000

బడ్జెట్ రావాల్సి ఉంది

ఇటీవలే వేదావతి ప్రాజెక్టుకు కొంత బడ్జెట్ కేటాయించారు. ఆర్థిక సంవత్సరం మొదలైంది. బడ్జెట్ వస్తే పనుల విషయం తెలుస్తుంది. తుంగభద్ర దిగువ కాలువ ఆయకట్టుకు నీరొస్తుంది. కేసీ పరిధిలో 0 నుంచి 120 కి.మీ వరకు రబీ ఆయకట్టు లేదు. అయినా కొన్ని తడులకు నీరిచ్చాం.

– కబీర్ బాషా, సీఈ, జల వనరుల శాఖ కర్నూలు ప్రాజెక్ట్సు

తర్తూరు జాతర చూసొద్దాం రండి!

కొలిచిన వారికి కొంగుబంగారమై శ్రీలక్ష్మీరంగనాథస్వామి తర్తూరు గ్రామంలో దేదీప్యమానంగా విరాజిల్లుతున్నాడు. భక్తులతోపాటు అన్నదాతలకు ఆరాధ్యదైవమై వెలుగొందుతూ పాడిపంటలు వృద్ధిచెందేలా అన్నదాతలను ఆశీర్వదిస్తున్న రంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమై ఈనెల 15 వరకు కొనసాగనున్నాయి. ఈనెల 13న స్వామి వారి రథోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే తర్తూరు జాతరకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎంతో పేరుంది. ఈ జాతరకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని నలుమూల ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు.

– జూపాడుబంగ్లా



శ్రీరంగనాథస్వామివారి మూలవిగ్రహం



ఆలయంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీదేవి అమ్మవారి మూలవిగ్రహం

- కొలిచిన వారికి కొంగుబంగారం లక్ష్మీరంగనాథస్వామి
- నేటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 13న రథోత్సవం

జూపాడుబంగ్లా మండలం మీదుగా వెళ్తున్న కర్నూలు–గుంటూరు రహదారికి 1.50 కిలోమీటర్ల దూరంలో తర్తూరు గ్రామం ఉంది. సుమారు 735 ఏళ్ల క్రితం గ్రామంలోని ఉల్పా వంశానికి చెందిన రాజారెడ్డికి తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన రంగమ్మతో వివాహమైంది. ఏటా హోలీ పున్నమినాడు దంపతులు ఇద్దరు పుట్టినిల్లు శ్రీరంగాపురంలో జరిగే శ్రీలక్ష్మీరంగనాథస్వామి ఉత్సవాలకు వెళ్లేవారు. వేడుకల అనంతరం ఆడ బిడ్డకు పుట్టింటివారు ఒడిబియ్యం పెట్టడం ఆనవాయితీగా ఉండేది. ఆ సందర్భంగా రంగమ్మకు ఒడిబియ్యం పెట్టి పండంటి బిడ్డ పుట్టాలని ఆడబిడ్డ రూపంలో ఉన్న ఓ చెక్కబొమ్మను పెట్టేవారు. తర్తూరు వచ్చిన తర్వాత రంగమ్మ పుట్టినింటి నుంచి తెచ్చిన ఒడిబియ్యాన్ని విప్పి చూడగా అందులో ఆడరూపంలో ఉన్న బొమ్మ మగరూపంలోకి మారుతుండటంతో మెట్టినింటివారు కోడలిని మందలించేవారు. ఒడిబియ్యంలోని మగరూపంలో ఉన్న చెక్కబొమ్మను పారవేసేవారు. దీంతో వారి వంశస్తులు ఎవ్వరో ఒకరు చనిపోతుండటంతో పాటు అనారోగ్యాల బారిన పడుతుండేవారు. ఇలా మూడు, నాలుగు పర్యాయాలు జరగడంతో కోపంతో వారు చెక్కబొమ్మను పశువుల గాడిలోకి విసిరివేయటంతో రంగనాథస్వామి పూనకం వచ్చి తాను శ్రీరంగనాథ స్వామినని తెలిపారు. తాను తర్తూరులోనే కొలువుంటానని, తనకు ఏటా జాతర నిర్వహిస్తే అష్టైశ్వర్యాలు ప్రసాదించటంతో పాటు పాడిపంటలు వృద్ధి చెందేలా చేయటంతో పాటు వంశాభివృద్ధి చెందుతుందని ఆయన ఆశీర్వదించాడు. అప్పటి నుంచి ఉల్పా వంశస్తులు స్వామివారు కొలువుదీరిన ఇంటితోపాటు 60 ఎకరాల పొలాన్ని స్వామివారికి దారాధత్తం చేసి ఏటా జాతర నిర్వహించేవారు.



తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి ఆలయ గాలిగోపురం



13న రథోత్సవం

నేటి నుంచి ప్రారంభమయ్యే తర్తూరు శ్రీలక్ష్మీ రంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 13న స్వామివారి దివ్యమంగళ రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన పూజారి ఈశ్వరరెడ్డి, ఫెస్టివల్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు.

కల్యాణం శ్రీరంగాపురంలో..

శ్రీలక్ష్మీరంగనాథునికి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించి అంగరంగ వైభవంగా జాతర నిర్వహిస్తున్నప్పటికీ కల్యాణం ఇక్కడ నిర్వహించకపోవటం గమనార్హం. శ్రీలక్ష్మీరంగనాథస్వామి తెలంగాణలోని శ్రీరంగాపురం నుంచి హోలీపౌర్ణమి అనంతరం నంద్యాల జిల్లాలోని తర్తూరు గ్రామానికి చేరుకుంటాడు. ఇక్కడ స్వామివారిని పెళ్లికుమారునిగా ముస్తాబు చేసి పదిరోజులపాటు పలురకాల వాహనాలపై ఊరేగిస్తూ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. తర్తూరులో పెళ్లి కుమారుడైన స్వామివారు నెల్లూరు జిల్లాలోని శ్రీరంగాపురం వెళ్లి అక్కడ శ్రీలక్ష్మీదేవి అమ్మవారితో కల్యాణం జరిపించుకుంటారని పూర్వీకులు పేర్కొంటున్నారు.

అపు'రూపం'

- చాక్‌పీస్‌పై సీతారామలక్ష్మణులు



చాక్‌పీస్‌లపై సీతారామ లక్ష్మణ, హనుమంతుని రూపాలు అద్భుతంగా ఆవిష్కృతమయ్యాయి. బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రుత్విక 3 గంటలు శ్రమించి చాక్‌పీస్‌లపై సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుని రూపాలు రూపొందించారు.

– కర్నూలు కల్చరల్

క్లుప్తంగా

న్యాయశాఖ ఉద్యోగుల కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): జిల్లా న్యాయశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం జిల్లా కోర్టుకు ఎదురుగా ఉన్న క్లబ్ క్యాంటీన్‌లో న్యాయశాఖ ఉద్యోగులు సమావేశమయ్యారు. సమావేశంలో జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎక్సైజ్ కోర్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈ.దేవేంద్రగౌడ్, జనరల్ సెక్రటరీగా పీడీఎం కోర్టు స్టెనోగ్రాఫర్ ఎస్.గోపాల్, ట్రెజరర్‌గా ప్రిన్సిపల్ కోర్టు జూనియర్ అసిస్టెంట్ ఎం.శివరాముడులతోపాటు ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, కమిటీ సభ్యులను అందరి ఆమోదంతో ఎన్నుకున్నారు.

ఇంట్లో ఆరడుగుల కోడెనాగు



నాగుపామును చూపుతున్న మోహన్

మహానంది: శ్రీనగరం గ్రామానికి చెందిన కృష్ణకుమారి ఇంట్లో శనివారం సాయంత్రం పెద్ద నాగుపాము కనిపించింది. ఇంట్లో ఉన్న ఓ బాలుడిని కాటేసేందుకు ప్రయత్నించగా త్రుటిలో తప్పించుకున్నాడు. పాము బయటి కి వెళ్లకపోవడంతో అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించగా అతడు అక్కడికి చేరుకుని ఆరు అడుగుల నాగుపామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశాడు.

వ్యక్తి ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ముగతిపేటలో ఉరివేసుకొని బాలచంద్ర(37) ఆత్మహత్య చేసుకున్నట్లు టౌన్ సీఐ వి. శ్రీనివాసులు శనివారం రాత్రి తెలిపారు. ముగతిపేటకు చెందిన బాలచంద్ర, గౌతమిలకు ఇద్దరు కుమారులు. మగ్గం వేసుకుంటూ జీవనం సాగించేవాడు. స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇంటి ఖర్చులు, కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగోలేకపోవటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించి పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కుటుంబంలో ఐదుగురికి అస్వస్థత

- ఆహారం విషతుల్యమే కారణమంటున్న వైద్యులు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో ఒకే కుటుంబంలో ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. ఈనెల 4న ఉదయం గ్రామానికి చెందిన సోమేశ్వరుడు, అతని తల్లి శివమ్మ, భార్య లావణ్య, కూతురు నిఖిత, కుమారుడు భరత్ సద్దన్నం (ఎగ్ రైస్, టమాటా రైస్‌గా చేసుకొని) తిన్నారు. వీరందరికి వాంతులు, విరేచనాలు కావడంతో స్థానిక పీహెచ్‌సీని ఆశ్రయించారు. డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్‌షా ప్రథమ చికిత్స చేసి ఆత్మకూరుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. స్థానిక వైద్యులు నాగలక్ష్మి, గులాబ్‌షా మాట్లాడుతూ అస్వస్థతకు విషతుల్యమైన ఆహారం తినడమే కారణమని, ఆయని ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన మొహమ్మద్

ఆదోని సెంట్రల్: పట్టణంలోని అమరావతినగర్‌కు చెందిన ముల్లనూర్ మొహమ్మద్(32) శనివారం రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్‌ఐ గోపాల్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి దుర్మరణం



వెంకటరమణ(ఫైల్)

జూపాడుబంగ్లా: బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొనటంతో ఓ యువకుడు దుర్మరణం కాగా, మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. నందికొట్కూరు మండలం మండ్లెం గ్రామానికి చెందిన తప్పెట వెంకటరమణ అలియాస్ మార్క్(35), రవి బైక్‌పై శనివారం మధ్యాహ్నం నందికొట్కూరుకు వెళ్లారు. పనిముగించుకొని స్వగ్రామానికి బయలుదేరారు. తంగడంచ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి హైవే రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొన్నారు. ప్రమాదంలో బైక్‌ను నడుపుతున్న వెంకటరమణ అక్కడికక్కడే మృతిచెందగా వెనుక కూర్చున్న రవి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహం చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి భార్య మనీష, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వీకర్ సెక్షన్ కాలనీలో కార్డెన్ సెర్చ్

కర్నూలు (టౌన్): నాలుగో పట్టణ పోలీసులు స్థానిక వీకర్ సెక్షన్ కాలనీలో శనివారం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానితులు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లల్లో తనిఖీలు చేసి, కాలనీలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఎరుకలి నరసింహ వద్ద 20 ప్యాకెట్ల స్టోర్ బియ్యం స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కర్నూలు టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్

కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌లో కర్నూలు నాలుగో పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, కోడుమూరు సీఐ తబ్రేజ్, కర్నూలు సబ్ డివిజన్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ


- రూ. 5.5 లక్షల నగదు, 8 తులాల బంగారు అపహరణ



చోరీ జరిగిన బీరువాను చూపుతున్న ఉపాధ్యాయుడు

కర్నూలు (టౌన్): ఇంట్లో అందరూ ఉన్నారు.. తలుపు గడియ కూడా పెట్టుకున్నారు.. అయినా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. రూ. 5.5 లక్షల నగదు, 8 తులాల బంగారు అపహరణ చేశారని ఉపాధ్యాయుడు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలులోని ధనలక్ష్మీనగర్ నివసించే కడబూరు చంద్రశేఖర్ రెడ్డి కల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రించాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 3 గంటల సమయంలో ఇంటికి ఉన్న ప్రధాన ద్వారం (మెయిన్ డోర్) పక్కన ఉన్న కిటికీ అద్దాలు పగల కొట్టి ఒక దొంగ.. ఇంట్లోకి ప్రవేశించాడు. బెడ్‌రూమ్‌లో డ్రస్సింగ్ టేబుల్ వద్ద ఉన్న తాళాలు బీరువా తెరచి.. అందులో ఉన్న రూ.5.50 లక్షల నగదు, 8 తులాల బంగారం తీసుకొని ఉడాయించారు. ఈ విషయాన్ని గమనించిన ఉపాధ్యాయుడు.. కర్నూలు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగతనం జరిగిన ఇంటిని సీఐ శేషయ్య పరిశీలించారు. వేలి ముద్రలు సేకరించారు. పక్క ఇంటిలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా.. ఒక దొంగ చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అక్షరాలతో రామాయణ చరిత్ర



శ్రీరాముని చిత్రం

నంద్యాల(అర్బన్): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ రామచరిత్రను తెలుగు అక్షరాలతో శ్రీరాముని ఊహా చిత్రాన్ని గీచారు. ఏ3 డ్రాయింగ్ షీట్‌పై మైక్రో పెన్నుతో 3 గంటలు శ్రమించి గీచిన చిత్రం పలువురి మన్ననలు అందుకుంది. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ శ్రీరాముని జననం నుంచి పట్టాభిషేకం వరకు అక్షరాలతో ఊహా చిత్రాన్ని గీచానన్నారు. మహావిష్ణువు త్రేతాయుగంలో శ్రీరాముడిగా లోక కల్యాణం కోసం అవతరించాడని, శ్రీరామచంద్రుడు సద్గుణవంతుడు, ఆదర్శప్రాయుడు, తండ్రి మాట జవదాటని తనయుడిగా ఒకే మాట, ఒకే బాణం, ఒకే సతీతో ఆదర్శంగా నిలిచారన్నా రు. ధర్మం తప్ప కుండా మనిషి ఎలా జీవించాలో లోకానికి చాటి చెప్పిన కారణజన్ముడు శ్రీరాముడన్నారు.

కుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

కొలిమిగుండ్ల: బెలుం శింగవరంలో వీధి కుక్క దాడి చేయడంతో శనివారం ఐదుగురికి గాయాలయ్యాయి. ఉదయం ఎవరి పని మీద వాళ్లు వీధుల్లో వెళుతుండగా దాడి చేసి గాయపర్చింది. నారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి, రంగేశ్వరరెడ్డితో ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు వారిని కొలిమిగుండ్ల పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. గ్రామంలో వీధుల్లో కుక్కల బెడద కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎప్పుడు జనాల మీద దాడి చేస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.

ముగిసిన వీరభద్ర, కాళికాదేవిల బ్రహ్మోత్సవాలు



వీరభద్రస్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పలలో వెలసిన వీరభద్రస్వామి, కాళికాదేవిల బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గత నెల 28న ప్రారంభమైన ఉత్సవాలు చివరి రోజు శనివారం వసంతోత్సవంతో పూర్తయ్యాయి. ఉత్సవాలలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి మల్లప్ప.. స్వామి వారికి గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు నిర్వహించారు. అంతకుముందు తెల్లవారుజామున వీరభద్రస్వామి చెక్క గుర్రంపై ఊరేగుతున్నట్లుగా అలంకారం చేసి గ్రామంలో ఊరేగించారు. స్వాముల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు నందికోలు ఆట ఆడారు. అనవాయితీగా స్వాములకు రంగులు వేసి వసంతోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు వేసుకుంటూ ఆనందోత్సవాల మధ్య వేడుకలు ముగించారు.



రంగులు వేసుకుంటున్న యువకులు

నాటుసారా స్థావరాలపై దాడులు

కర్నూలు (టౌన్): నగర పరిధిలోని బంగారుపేటలో నాటు సారా స్థావరాలపై శనివారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు, కళాజాతా ద్వారా నాటు సారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. 600 లీటర్ల ఊట, 10 లీటర్ల నాటు సారా ధ్వంసం చేశారు. నీలి షికారీ కాజల్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రెహెనా తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది చంద్రహాస్, రామలింగమయ్య, సుదర్శన్, రాజు, రామచంద్రుడు పాల్గొన్నారు.



నాటుసారా, ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కొనసాగుతున్న సోదాలు

కర్నూలు (సెంట్రల్): అక్రమ రేషన్ బియ్యంపై విజిలెన్స్, పౌర సరఫరాల అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. శనివారం 86, 87, 51 రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో 86వ షాపులో 89 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండటంతో 6ఎ కేసు నమోదు చేశారు. 51వ రేషన్ షాపులో ఈ–పాస్ మిషన్‌తో పోల్చితే స్టాక్ సరితూగింది. అలాగే కేఎల్ 82067 అనే ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేయగా కొలతల్లో తేడాలు లేనట్లు అధికారులు గుర్తించారు. సోదాల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.